BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 16 సెప్టెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## 8 ఏండ్ల బాలికపై లైంగికదాడి కేసు

- దోషికి 21 ఏళ్ల జైలు..30వేల జరిమాన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

చిన్నారిపై లైంగికదాడి ఘటన పోక్సో కేసులో నల్లగొండ అదనపు జడ్జి-2 సోమవారం నిందితునికి 21 ఏండ్ల జైలు శిక్ష, రూ.30 వేల జరిమానా విధించినట్టు ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. చిట్యాల మండలం వనిపాకల గ్రామానికి చెందిన దోమల రాములు మూడో తరగతి చదువుతున్న బాలిక(8)పై 11.02.2018న లైంగికదాడి చేశాడు. బాధితురాలి తండ్రి చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. నిందితునిపై పోక్సో కేసు నమోదైంది. పోలీసులు పూర్తి విచారణ జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అదనపు జడ్జి-2, ఎస్సీ ఎస్టీ కోర్టు, పోక్సో కేసుల కోర్టు నిందితున్ని దోషిగా నిర్ధారించింది. 20 ఏండ్ల కఠిన కారాగార శిక్ష, రూ.25,000 జరిమానా విధించారు. సెక్షన్ 448 ఐపిసి ప్రకారం ఏడాది జైలు, రూ.5000 జరిమానా మొత్తం 21 ఏండ్ల జైలు శిక్ష, రూ. 30 వేల జరిమానా విధించింది. బాధితురాలికి రూ.10 లక్షలు పరిహారంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అందించాలని తీర్పు వెలువడించింది. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి చార్జిషీట్ దాఖలు చేసి నిందితునికి శిక్ష పడేలా చేసిన దర్యాప్తు ఆఫీసర్ సీఐ పాండురంగారెడ్డి, ఎస్ఐ సైదాబాబు, ప్రాసిక్యూషన్‌కు సహకరించిన నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి, శాలిగౌరారం సీఐ నాగరాజు, నార్కట్‌పల్లి ఎస్ఐ రవికుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ వేముల రంజిత్‌కుమార్, సీడీసీ యాదయ్య, లైజన్ అధికారులు, లీగల్ ఆఫీసర్ బరోసా సెంటర్ కె.కల్పన, పి.నరేందర్, ఎన్ మల్లికార్జున్‌ను ఎస్పీ అభినందించారు.

# వీధి దీపాల నిర్వహణ సర్పంచులకే...



- పకడ్బందీగా వీధి దీపాల నిర్వహణ
- సోలార్ పవర్‌పై సాధ్యాసాధ్యాల పరిశీలన
- ఐఐటి సంస్థలతో ఆడిటింగ్ జరిపేలా చర్యలు
- పెద్ద కంపెనీల నుంచి టెండర్ల ఆహ్వానం
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

వీధిదీపాల నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుంచి వెంటనే టెండర్స్ పిలవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జీహెచ్ఎంసీ అధికారులతో సీఎం రేవత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహిచారు. ఈ సమావేశంలో అధికారులకు పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు. వీధి దీపాలకు సోలార్ పవర్‌ను వినియోగించడంపైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని మార్గనిర్దేశర చేశారు. రాష్ట్రంలోని అన్ని వీధిదీపాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని ఆదేశించారు. ఏఐతో ఎప్పటికప్పుడు విశ్లేషణ చేయాలని సూచించారు. గ్రామాల్లో వీధిదీపాల నిర్వహణను గ్రామ పంచాయతీకి అప్పగించాలని మార్గనిర్దేశర చేశారు . రాష్ట్రంలో వీధిదీపాల ఏర్పాటు-, నిర్వహణలో సమూల మార్పులు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేమ నరేందర్‌రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, కోర్ అర్బన్ ఏరియా మున్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు- అనేక ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో వీధిదీపాల ఏర్పాటు-, నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుండి -టె-ండర్లను పిలవాలని సూచించారు. దీనివల్ల పారదర్శకత పెరిగి, సేవల నాణ్యత మెరుగుపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే, వీధిదీపాల కోసం సౌరశక్తి వినియోగం సాధ్యాసాధ్యాలను లోతుగా పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వీధిదీపాల పనితీరును నిర్ధారించడానికి ఐఐటీ- వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సీఎం ఆదేశించారు. అంతేకాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని వీధిదీపాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేసి, కేంద్రంగా పర్యవేక్షించే విధానాన్ని రూపొందించాలని సూచించారు. దీని ద్వారా ప్రతి దీపం స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. వీధిదీపాల నిర్వహణలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. కృత్రిమ మేధస్సు ద్వారా ఎప్పటికప్పుడు విశ్లేషణ జరిపి, సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కారాలు తీసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో వీధిదీపాల నిర్వహణను పూర్తిగా గ్రామపంచాయతీలకే అప్పగించాలని నిర్ణయించారు. సర్పంచ్‌లకు దీపాల ఏర్పాటు-, నిర్వహణపై పూర్తి అధికారం ఇవ్వబడుతుంది. అయితే, ఈ పనులపై ఎంపీడీవో స్థాయిలో పర్యవేక్షణ ఉండాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి వీధిదీపం, ప్రతి పోల్‌పై సర్వే చేయాలని సీఎం ఆదేశించారు. దీని ద్వారా సమస్యలు, లోపాలు, అదనపు అవసరాలను గుర్తించి త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటు-ందని అన్నారు. వీధిదీపాల వ్యవస్థను ఆధునీకరించడానికి తీసుకుంటున్న ఈ చర్యలు రాబోయే రోజుల్లో రాష్ట్రానికి ఒక మోడల్‌గా నిలుస్తాయని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. పారదర్శక విధానాలు, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, గ్రామీణ స్థాయి అధికారానికి బాధ్యత కల్పించడం ద్వారా వీధిదీపాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించగలమన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు



# కాలేజీల యాజమాన్యాలతో చర్చలు సఫలం

- వారంలో రూ.600 కోట్లు విడుదల
- దీపావళిలోగా మరో రూ. 600 కోట్లు
- ప్రయివేటు కళాశాలలకు ప్రభుత్వం హామీ
- సమ్మె విరమిస్తున్నట్టు ప్రకటించిన కళాశాలల యజమాన్య సంఘాలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని ప్రయివేటు కాలేజీ యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు సంబంధించి తక్షణమే రూ.600 కోట్లు విడుదలకు ప్రభుత్వం అంగీకరించడంతో నిరవధిక బంద్‌ను విరమిస్తున్నట్టు కాలేజీ యాజమాన్యాలు ప్రకటించాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలంటూ సోమవారం నుంచి కాలేజీ యాజమాన్యాలు నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. కాలేజీ యాజమాన్యాల ప్రతినిధులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదివారం అర్ధరాత్రి వరకు చర్చలు జరిపారు. సోమవారం సాయంత్రం కూడా కొనసాగాయి. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ టోకెన్లకు సంబంధించిన నిధుల్లో రూ.600 కోట్లు త్వరితగతిన విడుదల చేయాలని నిర్ణయించామని చెప్పారు. మిగతా బకాయిలు ప్రతినెలా చెల్లిస్తామని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ హేతుబద్ధీకరణకు సంబంధించి ఉన్నతాధికారులు, కాలేజీ యాజమాన్యాలతో కలిపి కమిటీ వేయాలని నిర్ణయించామన్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావును ఆదేశించామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించినది కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత ఉన్న అంశమని అన్నారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి అనేక మంది మధ్యతరగతి కుటుంబాలు, పేదలు, బలహీనవర్గాల పిల్లలు చదువుతున్నారని వివరించారు. ఆర్థిక పరమైన భారం వారిపై పడకుండా చదివించాలనే ఆలోచనతో నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. అంతే చిత్తశుద్ధితో ఇప్పుడు ఈ ప్రభుత్వం దాన్ని కొనసాగిస్తుందన్నారు. ఆ దిశగానే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం ముందుకుపోతున్నదని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ద కాలం ఫీజురీయింబర్స్‌మెంట్ వ్యవస్థను

మిగతా 2వ పేజీలో

### విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యత

- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. "విద్యార్థుల భవిష్యత్తు తెలంగాణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశం. ఫీజు రియింబర్స్‌మెంట్ పథకం పేద, మధ్యతరగతి విద్యార్థులకు వరంలాంటిది. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని ఛిన్నాభిన్నం చేసింది. పదేళ్ల పాటు ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను పెండిగ్‌లో పెట్టి భారంగా మార్చింది. వారు విధ్వంసం చేసిన అంశాలను మేం క్రమక్రమంగా సరిదిద్దుతున్నాం. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఫీజురియింబర్స్‌మెంట్ సమస్యను కూడా పరిష్కరిస్తాం. ఈ పథకానికి సంబంధించి కళాశాలల వద్ద రూ.600 కోట్ల విలువైన టోకెన్లు ఉన్నాయి. ఇప్పటికే టోకెన్లు ఇచ్చిన రూ.600 కోట్ల నిధులు ఈ వారంలోనే విడుదల చేస్తామని హామీ ఇచ్చాం. ఫీజు రియింబర్స్‌మెంట్ రేషనలైజేషన్ కోసం ఒక కమిటీ వేయాలని నిర్ణయించాం. మా విజ్ఞప్తి మేరకు కళాశాలల బంద్‌ను విరమించుకున్నట్లు యాజమాన్యాలు చెప్పాయి. బంద్ విరమణకు ముందుకొచ్చిన యాజమాన్యాలకు ధన్యవాదాలు" అని తెలిపారు.



## కలెక్టరేట్‌లో ఆత్మహత్య యత్నం

- పురుగుల మందు తాగిన వృద్ధుడు..
- కొడుకు, కోడలు పోషించడం లేదని ఆవేదన

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

కొడుకు, కోడలు పోషించడం లేదని మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా, రుద్రంగి మండలానికి చెందిన అజ్మీరా విఠల్ అనే వ్యక్తి సిరిసిల్ల కలెక్టరేట్ కార్యాలయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో విఠల్ తన భార్య విరవ్వతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చాడు. తన కుమారుడు నరేష్ నాయక్, కోడలు తమను సరిగా పోషించడం లేదని, ఉన్న భూమిని కూడా వారే సాగు చేసుకుంటూ తమకు అన్నం పెట్టడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ క్రమంలోనే, మనస్తాపానికి గురైన విఠల్ అక్కడే పురుగుల మందు తాగాడు. వెంటనే అప్రమత్తమైన అధికారులు అతడిని చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విఠల్ అక్కడ చికిత్స పొందుతున్నాడు.

## జూబ్లీహిల్స్ నుంచే కేసీఆర్ జైత్రయాత్ర మొదలవ్వాలి



- కాంగ్రెస్ నేతల కనుసన్నల్లోనే యూరియా బ్లాక్ మార్కెట్
- రేవంత్ పాలనలో హైదరాబాద్‌లో పెరిగిన క్రైమ్ రేట్
- జూబ్లీహిల్స్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో 13 లక్షల పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వడానికి ఒక్క పైసా కూడా లేదని డిప్యూటీ సీఎం చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. విద్యార్థుల ఫీజుల కోసం లేని డబ్బులు, కమీషన్లు, కాంట్రాక్టులకు మాత్రం ఎక్కడి నుంచి వస్తున్నాయో ప్రభుత్వం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్ స్థాయి బూత్ కమిటీ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తాము 20 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బిల్లులను చెల్లించామన్నారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు గత కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన మూడు వేల కోట్ల రూపాయలను కూడా చెల్లించామన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం డబ్బులు లేవన్న సాకుతో పెండింగ్ బకాయిలను ఇవ్వడం లేదని విమర్శించారు. డబ్బులన్నీ ఉద్యోగుల జీతాలు, సంక్షేమ పథకాలకే ఖర్చవుతున్నాయి, రీయింబర్స్మెంట్‌కు ఒక్క పైసా కూడా లేదని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క చెప్పడం సిగ్గుచేటు అన్నారు. కాలేజీల బంద్‌ను ఆపి వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇక రాష్ట్రంలో తీవ్రంగా ఉన్న యూరియా కొరత, సంక్షోభానికి కాంగ్రెస్ పార్టీనే ప్రధాన కారణమన్నారు కేటీఆర్. రైతుల కోసం కేటాయించిన యూరియాను కాంగ్రెస్ నాయకులే బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నారని ఆరోపించారు. మిర్యాలగూడ కాంగ్రెస్ ఎమ్మెల్యే గన్‌మ్యాన్ ఒక లారీ లోడ్ యూరియాను ఎత్తుకుపోవడం రాష్ట్రంలో కాంగ్రెస్ నేతల దోపిడికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఒక గన్‌మ్యాన్ లారీ లోడ్ యూరియా ఎత్తుకుపోతే ఇక కాంగ్రెస్ నాయకులు, మంత్రులు ఎంత దోచుకుంటున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.గత ముఖ్యమంత్రులైన ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ఆర్, రోశయ్యలు ప్రవేశపెట్టిన కొన్ని పథకాలను కేసీఆర్ కొనసాగించారని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే కేసీఆర్ పేరు ఉందన్న ఏకైక కారణంతో రేవంత్ రెడ్డి

మిగతా 2వ పేజీలో

## చట్టవిరుద్ధమని తేలితే సర్ రద్దు చేస్తాం

- సుప్రీంకోర్టు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) అనుసరిస్తున్న పద్ధతుల్లో ఏదైనా చట్టవిరుద్ధం అని తేలితే, బీహార్‌లో చేపట్టిన 'ఓటర్ల జాబితా సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్)ను రద్దు చేస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బీహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యాలపై సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ నిర్వహణలో ఎలక్షన్ కమిషన్... చట్టాలను, తప్పనిసరి నిబంధనలను పాటించిందని తాము భావిస్తున్నామని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఎస్ఐఆర్‌పై తాము ఇచ్చే తుది తీర్పు బీహార్‌కు మాత్రమే పరిమితం కాదనీ, దేశం మొత్తానికి వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ అంశంపై తుది వాదనలను అక్టోబర్ 7న వింటామని సుప్రీంకోర్టు తెలిపింది.

అంతకు ముందు, నిర్ణీత కాల వ్యవధుల్లో దేశవ్యాప్తంగా 'ఓటర్ల జాబితా సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్వహించాలనే ఆదేశాలు జారీ అయితే తమ ప్రత్యేక అధికార పరిధికి విఘాతం కలుగుతుందని సుప్రీంకోర్టుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తెలిపింది. 'ఓటర్ల జాబితా సమగ్ర సవరణ'కు సంబంధించిన విధానంపై పూర్తి విచక్షణతో స్వతంత్రంగా నిర్ణయాన్ని తీసుకునే అధికారం తమకు ఉందని పేర్కొంది. ఈ విషయంలో ఇతర సంస్థలతో నిమిత్తం లేకుండా పనిచేసే స్వేచ్ఛ తమకు ఉందని ఈసీ చెప్పింది. ఈ మేరకు వాదనలతో సుప్రీంకోర్టులో కౌంటర్ అఫిడవిట్‌ను ఎన్నికల సంఘం దాఖలు చేసింది.

**ఆధార్ చెల్లుబాటు**

ఎలక్షన్ కమిషన్ బీహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్ కోసం 11 గుర్తింపు కార్డులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంది. అయితే వీటిలో ఆధార్ కార్డు లేకపోవడంతో ప్రతిపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళన చేశాయి. ఆధార్‌ను గుర్తింపు పత్రంగా పరిగణించాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. దీనితో ఆధార్‌ను 12వ గుర్తింపుపత్రంగా పరిగణించాలని సెప్టెంబర్ 8న సర్వోన్నత న్యాయస్థానం ఈసీకి ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆధార్ అనేది వ్యక్తుల గుర్తింపునకు, నివాసానికి చట్టబద్ధమైన రుజువుగా మాత్రమే ఉంటుందని, అది పౌరసత్వాన్ని

## ప్రీ ప్రైమరీ పాఠశాలలను అంగన్‌వాడీలకు అప్పగించాలి


**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

నూతన విద్యావిధానాన్ని రద్దుచేయాలని, ప్రీ ప్రైమరీ పాఠశాలలను అంగన్‌వాడీలకు అప్పగించాలని, తదితర సమస్యల పరిష్కారం కోసం డిమాండ్ చేస్తూ సోమవారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సోమవారం మంత్రులు, ఎమ్మెల్యేల ఇంటి ముట్టడికి పిలుపునిచ్చింది. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని సీఐటీయూ నాయకులతోపాటు అంగన్‌వాడీలు ముట్టడించారు. కొడంగల్ నియోజకవర్గంతో పాటు పరిగి, వికారాబాద్, తాండూర్, నారాయణపేట ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు కొడంగల్‌కు చేరుకున్నారు. అంతకుముందే అప్రమత్తమైన పోలీసులు సీఎం నివాసానికి వెళ్లే రెండువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు సీఎం ఇంటికి బయలుదేరగా.. గమనించిన పోలీసులు అక్కడికి చేరుకుని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు, అంగన్‌వాడీలకు మధ్య తోపులాట జరిగింది. ప్రతిఘటించిన సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు.. సీఎం ఇంటి ప్రధాన గేటు వద్దకు చేరుకుని ఇక్కడి నుంచి కదిలేదిలేదని భీష్మించారు. జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. దాంతో అంగన్‌వాడీలను అరెస్టు చేసే క్రమంలో పోలీసులు జులుం ప్రదర్శించారు. మహిళలు అని కూడా చూడకుండా మగ పోలీసులే అంగన్‌వాడీ టీచర్లను, సీఐటీయూ నాయకులను కాళ్లు, చేతులు పట్టి లాక్కెళ్లారు. దాంతో పలువురు గాయపడటంతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తతగా మారింది

## కేరళలో ప్రాణాంతక అమీబా విజృంభణ

- 67 కేసులు, 18 మరణాలు

**బలగం టీవి, తిరువనంతపురం**



మనిషి మెదడు కణాలను దెబ్బతీసే ప్రమాదకరమైన సూక్ష్మజీవి అమీబా కేరళలో విరుచుకుపడింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 67 కేసులు అధికారికంగా నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 18 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆరోగ్య శాఖ వెల్లడించింది. తాజా లెక్కలను సోమవారం అధికారికంగా ప్రకటించారు. స్థితిగతులపై రాష్ట్ర ఆరోగ్య మంత్రి వీణా జార్జి అత్యవసర సమావేశం నిర్వహించి, మంచినీటి భద్రతతో పాటు వైద్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సాధారణంగా కలుషిత నీరు తాగడం, ఆ నీటితో స్నానం చేయడం వల్ల ఈ అమీబా మనిషి శరీరంలోకి ప్రవేశించి మెదడులో కణాలను నాశనం చేస్తుందని వైద్య నిపుణులు తెలిపారు. ఇది ముదిరితే ప్రాణాంతకమవుతుందని హెచ్చరించారు.

**స్విమ్మింగ్ పూల్ మూసివేత**

తిరువనంతపురం జిల్లా అక్కులం టూరిస్ట్ గ్రామం స్విమ్మింగ్ పూల్‌లో జలకాలాడిన 17 ఏళ్ల బాలుడికి ఈ అమీబా సోకినట్లు నిర్ధారణ అయింది. దీంతో ఆరోగ్య శాఖ ఆ స్విమ్మింగ్ పూల్‌ను తక్షణమే మూసివేసింది. నీటి నమూనాలను పరీక్షల కోసం పంపినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు నిల్వ నీటిలో లేదా కలుషిత కొలనుల్లో ఈతకుదరకుండా, తలస్నానాలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య మంత్రి వీణా జార్జి విజ్ఞప్తి చేశారు. సాధారణంగా ఈ బ్యాక్టీరియా ముక్కు ద్వారా శరీరంలోకి చేరి మెదడుపై ప్రభావం చూపుతుందని నిపుణులు తెలిపారు.

కోజికోడ్ వైద్య కళాశాలలో చికిత్స పొందుతున్న బాధితుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఈ బ్యాక్టీరియాతో సంబంధిత కేసులు వెలువడటంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నెలకొంది.

## వక్ఫ్ (సవరణ) చట్టంపై సుప్రీంకోర్టు పాక్షిక స్టే



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

కొత్తగా తీసుకొచ్చిన వక్ఫ్ (సవరణ) చట్టం, 2025 చట్టబద్ధతను సవాలు చేసిన పిటిషనర్లకు సుప్రీంకోర్టు సోమవారం పాక్షిక ఉపశమనం కల్పించింది. చట్టంలోని కొన్ని వివాదాస్పద నిబంధనలపై ధర్మాసనం స్టే ఇచ్చింది. సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంటూ, "మొత్తం చట్టంపై స్టే అవసరం లేదు. రాజ్యాంగపరమైన సవాళ్లపై విస్తృతంగా విచారణ జరుపుతాం" అని తెలిపింది.

వక్ఫ్ బోర్డులో ఎవరు సభ్యులుగా ఉండాలన్న అంశంపై సిఫార్సు చేయడంతోపాటు వక్ఫ్‌ను ఎవరు సృష్టించవచ్చు, ఆక్రమణలకు చెందిన వివాదాలను ఎవరు పరిష్కరించాలన్న అంశాలకు సంబంధించిన నిబంధనలను సుప్రీంకోర్టు నిలిపివేసింది. వక్ఫ్ చట్టంపై మొత్తంగా స్టే విధించాల్సిన అవసరం ప్రస్తుతం న్యాయస్థానానికి కనిపించడం లేదని, కొత్త చట్టంలో రాజ్యాంగపరమైన సవాళ్లకు సంబంధించి విస్తృత స్థాయిలో విచారణ జరుపుతామని సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది.

మొత్తం చట్టాన్నే పిటిషనర్లు సవాలు చేశారని, అయితే మౌలికంగా చట్టంలోని 3(ఆర్), 3సీ, 14 సెక్షన్లను పిటిషనర్లు సవాలు చేశారని ధర్మాసనం తెలిపింది. సవాలు చేసిన సెక్షన్లపై తాము స్టే ఇస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. వక్ఫ్‌ను సృష్టించే వ్యక్తి ఐదేళ్ల పాటు ఇస్లాం మతాన్ని తప్పనిసరిగా పాటించాలన్న నిబంధనను(సెక్షన్ 3(ఆర్) నిలిపివేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఇస్లాంను ఆచరిస్తున్న వ్యక్తిని నిర్ధారించడానికి నిబంధనలు రూపొందించే వరకు ఈ సెక్షన్‌పై స్టే విధిస్తున్నట్లు కోర్టు పేర్కొంది. వక్ఫ్ ఆస్తిగా ప్రకటించిన ఆస్తి ప్రభుత్వ ఆస్తి అవునా కాదా అన్న విషయాన్ని నిర్ధారించి ఉత్తర్వులు జారీ చేసే అధికారాన్ని కలెక్టర్‌కు అప్పగిస్తూ చట్టంలో పొందుపరిచిన నిబంధనపై(సెక్షన్ 3సీ(4)) కూడా ధర్మాసనం స్టే విధించింది.

వక్ఫ్ ఆస్తిగా ప్రకటించిన ఆస్తి ఆక్రమణ ద్వారా జరిగిందీ లేనిదీ నిర్ధారిస్తూ ప్రభుత్వం నియమించిన అధికారి నివేదికను సమర్పించే వరకు వక్ఫ్ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదన్న నిబంధనపై(సెక్షన్ 3సీ(2) కూడా కోర్టు స్టే ఇచ్చింది. వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతర సభ్యులను చేర్చాలన్న నిబంధనపై(సెక్షన్ 9,14) స్టే ఇవ్వడానికి కోర్టు నిరాకరించింది. రాష్ట్ర వక్ఫ్ బోర్డులలో ముగ్గురికి మించి ముస్లిమేతర సభ్యులను నియమించరాదని, వక్ఫ్ కౌన్సిళ్లలో నలుగురికి మించి ముస్లిమేతర సభ్యులను నియమించరాదని ధర్మాసనం స్పష్టం చేసింది.

## అమెరికాను సురక్షితం చేయడమే లక్ష్యం

నాగమల్లయ్య హత్యపై తీవ్రంగా స్పందించిన ట్రంప్

**బలగం టీవి, వాషింగ్టన్**



అమెరికాను మళ్లీ సురక్షితం చేయడమే తమ లక్ష్యమని అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని అన్నారు. అక్రమ వలసలను ఇక ఎంతమాత్రం ఉపేక్షించబోమని అన్నారు. డాలస్‌లో భారతీయుడు చంద్ర నాగమల్లయ్యను క్యూబా వలసదారుడు హత్య చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. నిందితుడిపై ఫస్ట్ డిగ్రీ కింద అభియోగాలు నమోదు చేసి విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. 'ఇకపై అక్రమ వలసదారులపై మెతకవైఖరి అవలంబించబోమని స్పష్టం చేశారు. 'చంద్ర నాగమల్లయ్య హత్య కేసులో సంచలన విషయాలు నా దృష్టికి వచ్చాయి. డాలస్‌లో మల్లయ్యకు మంచి పేరుంది. అలాంటి వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. తన భార్య, కుమారుడు చూస్తుండగానే ఈ ఘోరం జరిగింది. మా దేశానికి సంబంధం లేని, క్యూబాకు చెందిన అక్రమ వలసదారుడు ఈ దురాగతానికి పాల్పడ్డాడు' అని ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికలో పోస్టు పెట్టారు. గతంలో బైడెన్ ప్రభుత్వం అనుసరించిన విధానమే నిందితుడు మార్టినెజ్ అమెరికాలో నివసించేందుకు దోహదపడిందని ట్రంప్ విమర్శించారు. అతడికి నేరచరిత్ర ఉన్నా.. నివాసానికి అనుమతించారని ధ్వజమెత్తారు. 'ఈ వ్యక్తి క్రూరమైన నేరాలకు పాల్పడి గతంలోనే అరెస్టయ్యాడు. చిన్నారిపై లైంగిక దాడి, దొంగతనం తదితర కేసులు అతడిపై నమోదయ్యాయి. అలాంటి వ్యక్తిని బైడెన్ మా గడ్డ మీదకు తీసుకొచ్చారు. ఎందుకంటే క్యూబా ఇలాంటి దుష్టులను తమ దేశంలో ఉంచుకోవాలను కోలేదు. అక్రమ వలసదారులపై ఇక సున్నితంగా వ్యవహరించబోను' అంటూ ట్రంప్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 10న ఓ మోటెల్‌లో నాగమల్లయ్య హత్యకు గురయ్యారు. క్యూబాకు చెందిన యోర్డానిస్ కోబోస్ మార్టినెజ్ ఈ దారుణానికి పాల్పడ్డాడు. వెంటనే పోలీసులు అతడిని అరెస్టు చేశారు. నాగమల్లయ్య తల నరికి మరీ దానికి చెత్తబుట్టలో వేయడంతో ఈ కేసు సంచలనంగా మారింది.



## మినీ హ్యాండ్‌బాల్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోస్టర్ ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 29 వరకు నిజాం కళాశాలలో జరగనున్న 17వ హెచ్ఎఫ్ఐ మినీ హ్యాండ్‌బాల్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోస్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "రాష్ట్ర యువత క్రీడల వైపు మరింత ఆసక్తి చూపి ముందుకు రావాలి. క్రీడలకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తుంది" అని ఆకాంక్షించారు. నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం, దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి సుమారు 1200 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. పోటీలు నాలుగు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనా రెడ్డి, తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్రెడ్డి రాంరెడ్డి, తెలంగాణ ఖో–ఖో అసోసియేషన్ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, జాయింట్ సెక్రటరీ రమేష్, రిఫరీస్ బోర్డు చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సోలిపురం వెంకట్రాంరెడ్డి, ఎంఎంసి డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ నుంచే కేసీఆర్ జైత్రయాత్ర మొదలవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఎన్నో మంచి పథకాలను నిలిపివేసిందని ఆరోపించారు. కేసీఆర్ కిట్లు, బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫాలు అన్నింటినీ ఆపేశారని చెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా కాంగ్రెస్ నాయకులు అందినకాడికి దోచుకుతింటున్నారని మండిపడ్డారు. అప్పులు చేయకుండా ఆదాయం పెంచి పాలన చేస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పుకున్న కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చిన 24 నెలల్లో ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి నిర్వాకంతో ఊర్లలో అత్తా, కోడళ్ల మధ్య కొత్త పంచాయతీలు మొదలైనయన్నారు.

హైదరాబాద్‌లో పట్టపగలే దోపిడీలు, అత్యాచారాలు జరుగుతున్నాయని, క్రైమ్ రేట్ విపరీతంగా పెరిగిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలపై ప్రేమ ఉంటే వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలకు మంత్రులు పోవాలి కాని ఉపఎన్నికల ప్రచారంలో తిరగొద్దన్నారు. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని తెలంగాణలోని ప్రతి ఒక్కరు కోరుకుంటున్నారన్న కేటీఆర్, గులాబీ జైత్రయాత్ర జూబ్లీహిల్స్ ఉపఎన్నికతోనే మొదలవ్వాలన్నారు. తెలంగాణ దివాలా తీసింది, ఎయిడ్స్ పేషెంట్, క్యాన్సర్ పేషెంట్ అంటూ రేవంత్ రెడ్డి రాష్ట్రం పరువు తీస్తున్నాడని కేటీఆర్ విమర్శించారు.

చివరి శ్వాస వరకు ప్రజాసేవలోనే ఉన్న మాగంటి గోపీనాథ్ సేవలను గుర్తు చేసుకున్న కేటీఆర్, తామంతా కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పీజేఆర్, కేసీఆర్ పోరాట స్ఫూర్తితో బీఆర్ఎస్ కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే తమ ఇంటిని కూల్చివేసేందుకు పర్మిషన్ ఇచ్చినట్టే అన్న విషయాన్ని ప్రజలకు తెలియచేయాలని కార్యకర్తలకు సూచించారు. జీవో నెంబర్ 58, 59 కింద లక్ష మందికి కేసీఆర్ పట్టాలిచ్చారని, కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేల మంది ఇళ్లను కూలగొట్టిందని కేటీఆర్ ఆరోపించారు.

ఆరు గ్యారెంటీలు ఇవ్వకుండా మోసం చేసినందుకు, ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గోస పెడుతున్నందుకు, హైదరాబాద్‌ను ఆగం చేసినందుకు కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్పాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్‌లో ఘన విజయం సాధించి మాగంటి గోపీనాథ్‌కు నివాళి అర్పించాలని కోరారు.

## మంచిర్యాలలో వందే భారత్ ట్రైన్ హాల్టింగ్ ప్రారంభం

**బలగం టీవీ, హైదరాబాద్**

మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో నాగ్‌పూర్ టూ సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ హాల్టింగ్‌ను సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ రైల్వే చరిత్రలో వందే భారత్ విప్లవాత్మక మార్పులు తెచ్చిందని, దేశవ్యాప్తంగా ప్రస్తుతం 150 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని తెలిపారు. వీటి ద్వారా ఇప్పటి వరకు 3కోట్ల మంది ప్రయాణికులు ప్రయోజనం పొందారని, ఒక్కో వందే భారత్ రైలు తయారీకి సుమారు రూ.130కోట్లు ఖర్చవుతాయని వివరించారు.

ప్రస్తుతం తెలంగాణలో 5 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని, త్వరలో మరో 2 రైళ్లురాబోతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో రైల్వే అభివృద్ధి కోసం కేంద్రం సుమారు రూ.80వేల కోట్లు వెచ్చించనుందని చెప్పారు. అమృత్ భారత్ పథకం కింద రైల్వేస్టేషన్లు మినీ ఎయిర్‌పోర్టుల్లా రూపుదిద్దుకుంటున్నాయని తెలిపారు. మంచిర్యాల అభివృద్ధికి ప్రత్యేక నిధు లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి కోసం రూ.3.5కోట్లు కేటాయించామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అదనంగా స్టేషన్ అభివృద్ధికి అమృత్ భారత్ పథకం కింద రూ.26కోట్లు కేటాయిం చామన్నారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, కలెక్టర్ కుమార్ దీపక్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

**యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నల్ దాస్ గణేష్**

**బలగం టీవీ, సిరిసిల్ల**



గ్రామపంచాయతీలో పనిచేసే కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు పెండింగ్లో ఉన్నాయని, వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నల్ దాస్ గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెండింగ్ వేతనాలు చెల్లించాలని జిల్లా కలెక్టరేట్లోని ప్రజావాణిలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కి వినతి పత్రం సమర్పించారు. అనంతరం అన్నల్ దాస్ గణేష్ మాట్లాడుతూ

తెలంగాణలోనే అతిపెద్ద పండుగ బతుకమ్మ దసరా పండుగలు వస్తున్నందున వేతనాలు రాక పండుగ కోసం భార్యా పిల్లలకు బట్టలు తీసుకోలేకపోవడంతో ఇంట్లో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ప్రతినెలా ఒకటవ తేదీన గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు అందిస్తామని ప్రకటించినరని, దేవుడు కరుణించిన పూజారి అడ్డుకున్నట్టు ముఖ్యమంత్రి చెప్పిన మా వేతనాల సమస్య పరిష్కారం కావడం లేదని అన్నారు.ప్రతి నెల వేతనం రాక కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయని అన్నారు. వచ్చే వేతనాలే అరకొరగా ఉంటే ఆ వేతనం కూడా ప్రతి నెల ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నరని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రతి నెల మొదటి తారీఖున వేతనాలు అందించేలా చూడాలని అన్నారు.కలెక్టర్ మా సమస్యను విని వెంటనే జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకువెళ్లి రెండు రోజుల్లో పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆదేశించారని అన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ కి ధన్యవాదాలు తెలపారు. ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, కనీస వేతనం 26000 చెల్లించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని జీవో నెంబర్ 51 సవరించలని, ఇన్సూరెన్స్ ప్రత్యేక వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ మండల అధ్యక్షులు వర్కోలు మల్లయ్య, బుర్ర శ్రీనివాస్, లొకిని శ్రీనివాస్, నరపురం నర్సయ్య, రేసు రాజయ్య, పెంట రాజు, బిగుల్లా అశోక అక్కల అంజయ్య, సందేలా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాలేజీల యజమాన్యాలతో చర్చలు సఫలం

(మొదటి పేజీ తరువాయి)

చిన్నాభిన్నం చేసిందని విమర్శించారు. కొన్నేండ్లు ఫీజు బకాయిలను చెల్లించలేదని అన్నారు. ఆ భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందన్నారు. రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసం చేసిందని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తూ సమస్యలను పరిష్కారం చేస్తూ ముందుకు పోతున్నామని వివరించారు. రాష్ట్రంలో ప్రయివేటు కాలేజీ యాజమాన్యాల సమస్యలు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని నిర్ణయించామన్నారు. ప్రభుత్వానికి భారమైనా పరిష్కరిస్తామని చెప్పారు. కాలేజీల బంద్‌ను విరమించడానికి ముందుకొచ్చినందుకు యాజమాన్యాలకు ఆయన ధన్యవాదాలు ప్రకటించారు. విద్యాపరమైన అంశాలకు ఈ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంద న్నారు. అందుకోసం అందరి సహాయ సహకారాలను అందించాలని కోరారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించాలన్నదే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

తమ సమస్యలు, కష్టాలను ఈ ప్రభుత్వం అర్థం చేసుకుందని ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఏటీహెచ్ఐ) చైర్మెన్ నిమ్మటూరి రమేష్‌బాబు అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్లో టోకెన్లు ఉన్న రూ.600 కోట్లు త్వరగా విడుదల చేయాలని నిర్ణయించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పారు. దసరా ముందు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో అధ్యాపకులు, ఇతర సిబ్బందికి శుభసూచకమని అన్నారు. తాము సోమవారం నుంచి తలపెట్టిన నిరవధిక బంద్‌ను విరమించుకుంటున్నామని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వానికి భవిష్యత్తులోనూ సహాయ సహకారాలను అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డి శ్రీధర్‌బాబు, సీఎస్ కె రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసే, ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, ఎఫ్ఏటీహెచ్ఐ సెక్రటరీ జనరల్ కెఎస్ రవికుమార్, కోశాధికారి కె కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె సునీల్‌కుమార్, ఇతర ప్రతినిధులు అల్జాపూర్ శ్రీనివాస్, తుమ్మ జైపాల్‌రెడ్డి, ఎస్ పరమేశ్వర్‌రెడ్డి, రేపాక ప్రదీప్‌రెడ్డి, గుర్రం నాగయ్య, కె రామదాస్, ముద్దసాని రమేష్‌రెడ్డి, పుల్లా రమేష్‌బాబు టీపీడీఎంఏ అధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి యాద రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చాలి'

**బలగం టీవీ, హైదరాబాద్**

త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చాలని పుట్టపాక, సర్వేలు, లింగారెడ్డిగూడెం గ్రామాల రైతులు సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని దేవిరెడ్డి గూడెం వద్ద రోడ్డుపై బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతు లు, రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుకు 40 కిలోమీటర్ల దూరంలో నిర్మించాల్సిన త్రిబుల్ ఆర్‌ను చౌటు ప్పల్‌లోని దివిస్ కంపెనీ, కొంతమంది పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 28, 30 కిలోమీటర్లలోపు నిర్మించేందుకు తీసు కొచ్చిందన్నారు. ఆ అలైన్‌మెంట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కంపెనీల మీద ఉన్న ప్రేమ రైతులపై లేదని విమర్శించారు. జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యే దివిస్ కంపెనీ యాజమాన్యం పెట్టే ఎంగిలి మెతుకుల కోసం త్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చారంటూ ఆరోపించారు.

పుట్టపాక, సర్వేలు, లింగవారిగూడెం గ్రామాలకు చెందిన వందలాది ఎకరాల రైతుల పట్టా భూములు పోతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు దివిస్‌ను పారదోల్తామని చెప్పిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి గెలిచాక రైతులనే పారద్రోలే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రాణం పోయినా తమ భూములను వదులుకోబోమన్నారు. నల్లగొండలో మంత్రి వెంకట్‌రెడ్డిని కలిసి తమ గోడు వినిపించుకునేందుకు వెళ్తే పోలీసు లు అడ్డుకోవడం దారుణన్నారు. తమ ఆవేదన చెప్పేందుకు మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కలిస్తే.. ఉత్తరభాగం మారాలంటే ముందు దక్షిణ భాగం మారాలని.. ఈ రెండు మారాలంటే ప్రభుత్వమే మారాలేమో అని చెప్పుకొచ్చారని విమర్శించారు. రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఐ(ఎం) అండగా ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు దోనూరు నర్సిరెడ్డి, దొంతగాని పెద్దులు అన్నారు. కలిసికట్టుగా ఐక్య ఉద్యమాలతో అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రాస్తారోకోలో బద్దుల వెంకటయ్య, నాగార్జున, పలువురు రైతులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌తో యూఎస్ కాన్సూల్ జనరల్ విలయమ్స్ భేటీ

**బలగం టీవీ, హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యూఎస్ కాన్సులేట్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి, తదితర అంశాలను వీరు చర్చించారు. ఇఈవలే విలియమ్స్ హైదరాబాద్ కాన్సూల్జనరల్‌గా బాధ్యతలు స్వీకరించారు.





## అర్జీలు సకాలంలో పరిష్కరించాలి..

- మొత్తం 185 దరఖాస్తుల రాక
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ, సిరిసిల్ల**

ప్రజావాణి కు వచ్చే అర్జీలు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ప్రజల నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 185 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, జెడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేపు ప్రజా పాలన దినోత్సవం

**-జాతీయ జెండాను ఎగురవేయనున్న విప్ అది శ్రీనివాస్**

**బలగం టీవీ, సిరిసిల్ల**



ఈ నెల 17వ తేదీన బుధవారం ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలోని మైదానంలో ఏర్పాటు చేయనున్న కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ముందుగా పోలీస్ ల నుంచి గౌరవ వందనం స్వీకరించి,అనంతరం జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



## గ్రామ దేవతలకు మొక్కులు..

**బలగం టీవీ, బోయినిపల్లి**

బోయినిపల్లి మండలం తడగొండ గ్రామంలో అన్నపూర్ణ ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున గ్రామ పోచమ్మ తల్లి, దుర్గమ్మ లకు యూనియన్ సభ్యులు మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం వారు మాట్లాడుతూ.. అమ్మవార్ల ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు పండాలని అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా గ్రామంపై ఉండాలని కోరుకున్నామన్నారు. అనంతరం అన్నపూర్ణ ట్రాక్టర్ యూనియన్ సభ్యులు భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.




## కరాటేలో ప్రతిభ కనబర్చిన వాణినికేతన్ విద్యార్థులు..

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

మండల కేంద్రంలోని వాణినికేతన్ హై స్కూల్ విద్యార్థులు కరాటే లో ప్రతిభ కనబరిచారు. కరీంనగర్ లో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా కరాటే చాంపియన్షిప్ 2025 లో పలువురు విద్యార్థులు మెడల్స్ సాధించారు. ఏనుగుల సుశాంత్ గోల్డ్ మెడల్ సాధించగా, చెలిమిల రక్షిత, చొప్పరి విగ్నేశ్వర్, సావనపెల్లి ప్రహల్యలు సిల్వర్ మెడల్స్ సాధించారు. చొప్పరి హర్షిత, నల్గొండ అక్షర, చొప్పరి శ్రీజై లు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. కుమిటే విభాగంలో విగ్నేశ్వర్ సిల్వర్ మెడల్ అందుకున్నాడు. కరాటే లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీ నిధి, కరాటే మాస్టర్ శరత్ లతో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# మహిళల అభ్యున్నతికి కట్టుబడున్న కాంగ్రెస్

- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు మహిళలు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను మర్యాద పూర్వకంగా కలసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో ముందుకు పోతున్నారని తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించడం జరిగిందని తద్వారా మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సంకల్పించారని అన్నారు.

ఆనాడు ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మేలు జరిగితే మళ్లీ రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో మహిళా తల్లిలకు పేద్దపీఠ వేయడం జరుగుతుందని తెలిపారు.. ప్రజా ప్రభుత్వంలో మహిళలకు 20వేల పైచిలుక కోట్లను కేటాయించడం జరిగిందని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు, పెట్రోల్ పంప్, ధాన్యం కొనుగోలు, రైస్ మిల్ వంటి అనేక వ్యాపారాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం నూతనంగా అందించే రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లను కూడా మహిళల పేరు మీద మంజూరు చేస్తుందని తెలిపారు.

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు వారు ఆర్థికంగా ఎదగాలని మైక్రో ఎంటర్ప్రైజేషన్, మహిళా శక్తి స్టిచ్చింగ్ సెంటర్స్, ఈవెంట్ మేనేజ్మెంట్ యూనిట్లో, సోలార్ పవర్ ప్లాంట్, డైరీ యూనిట్స్ వంటి వాటిని ఎర్పాటు చేయడం కోసం బ్యాంకు లింకేజీ వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు%ా

2024-25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు లింకేజీ ద్వారా 20,084 కోట్లు, 2025-26 సంవత్సరానికి 58 కోట్లు బ్యాంకు లింకేజీ అందజేయడం జరిగిందని తెలిపారు. 4350 సంఘాలకు 5 కోట్ల 72 లక్షల వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యురాళ్లకి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన లోన్ బీమా, ప్రమాద బీమా స్కీం వలన ఎంతో మందికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రమాదవశాత్తు ఎవరైనా సంఘ సభ్యులు చనిపోతే వర్ తీసుకున్న రుణం మాఫీ తో పాటు పదిలక్షల వరకు ఇన్సూరెన్స్ చెల్లించడం జరుగుతుందని తెలిపారు. వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ఆశీర్వాదాలు అందజేయాలని పిలుపునిచ్చారు.

## సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయిన యువకుడు

- యాప్ లింక్‌ను క్లిక్ చేయగా రూ. 70 వేలు మాయం!
- రాచర్ల బొప్పాపూర్ లో ఘటన.. "జెమినీ" అనే ఫోటో ఎడిట్ యాప్‌తో సైబర్ నేరగాళ్ల వల..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్న నానో బనానా ట్రెండ్ ఇప్పుడు సైబర్ నేరగాళ్లకు ఒక కొత్త అవకాశంగా మారింది. ఈ ట్రెండ్‌ను అనుసరించి తన ఫోటోను 3డీగా మార్చుకోవాలనుకున్న ఒక యువకుడు సైబర్ మోసగాళ్ల వలలో చిక్కుకొని రూ. 70 వేలు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా, ఎల్లారెడ్డిపేట మండలం, రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో జరిగింది.

బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఏఐ ఫోటోలు చూసి, తానూ అలాంటి ఫోటో తీసుకోవాలన్న ఆశతో ఫేస్‌బుక్‌లో కనిపించిన ఒక ఇమేజ్ ఎడిటింగ్ యాప్ లింకును క్లిక్ చేసి తన మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నాడు. ఆ యాప్ ద్వారా తన ఫోటోను 3డీ ఫార్మాట్‌లోకి మార్చిన కొద్దిసేపటికే అతని బ్యాంకు ఖాతా నుండి రూ. 70 వేలు మాయమయ్యాయి. దీంతో షాకైన ఆ యువకుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.ప్రాథమిక విచారణలో ఇది సైబర్ నేరగాళ్లు చేసిన పనని పోలీసులు గుర్తించారు. ఇలాంటి ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ విభాగం హెచ్చరిస్తోంది. అనుమానాస్పద లింకులు, గుర్తు తెలియని యాప్స్‌ను డౌన్‌లోడ్ చేయవద్దని, సున్నితమైన సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు.



## నామకరణ మహోత్సవంలో పాల్గొన్న ప్రెస్ క్లబ్ సభ్యులు..

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వైశ్య భవన్ లో మానకొండూరు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అంతగిరి వినయ్ కుమార్ సోదరి శ్రీవాణి శ్రీనివాస్ రావు ల కుమార్తె నామకరణ మహోత్సవం లో ఇల్లంతకుంట మండల ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తూముకుంట శ్రీనివాస్ రెడ్డి, టీయూడబ్ల్యూజే 143 రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు, మండల అధ్యక్షుడు బొల్లం పరశురామ్, ఉపాధ్యక్షుడు సలీమ్, సీనియర్ జర్నలిస్ట్ లు కొయ్యడ రాజయ్య, బట్టు శ్రీనివాస్, రాకం సుమన్, దయ్యాల సురేష్, బండారి శ్రీనివాస్, అనిల్, చందు తదితరులు పాల్గొన్నారు.

## హిందూ వాహిని నూతన కమిటీ అధ్యక్షుడిగా నాగసముద్రాల బాలకృష్ణ

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలో యువజన సంఘాల అధ్యక్షుడు ఉప్పల అమరేందర్, అన్ని యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో హిందూ వాహిని నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన నాగసముద్రాల బాలకృష్ణ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. గౌరవాధ్యక్షులుగా మామిడి సంజీవ్, కూనబోయిన బాలరాజు, కోహెడ భాస్కర్, కొండ్ల వెంకట్ రెడ్డి ఎన్నుకోబడ్డారు. కమిటీ సభ్యులుగా అన్ని యువజన సంఘాల సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.

# పలువురిని పరామర్శించిన రాష్ట్ర ప్రభుత్వ విప్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా, కొనరావుపేట మండలం, సుద్దాల గ్రామంలో ఇటీవల మరణించిన పలువురి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇటీవల మరణించిన అలువాల దేవయ్య, పల్లి పెద్ద భూమయ్య, బోయినిపల్లి మధు సూదన్ రావు, కుంటెల్లి రామస్వామి, ఎరవెల్లి అమూల్య, సుంకరి మల్లవ్వ ల కుటుంబాలను ఆయన స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కష్టకాలంలో ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. వారి కుటుంబాలకు ధైర్యం చెప్పి, ఆర్థికంగా చేయూతనిస్తామని హామీ ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈ విజయం భారత్ సైన్యానికి అంకితం

## ● టీమిండియా కెప్టెన్ సూర్య కుమార్




బలగం టీవీ, హైదరాబాద్

దుబాయ్‌లో జరిగిన ఆసియా కప్ 2025 మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై చిరస్మరణీయ విజయాన్ని సాధించింది. ఈ విజయం పై టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సంతృప్తిని వ్యక్తం చేశాడు. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో బాధితులు, కుటుంబాలకు ఆయన నివాళు లర్పించారు. భారత సాయుధ దళాలకు సంఘీభావం తెలిపారు. పాకిస్తాన్‌పై సాధించిన విజయాన్ని భారత్ ఆర్మీ ధైర్యసాహసాలకు అంకితం చేశారు. జట్టు ప్రదర్శన వారికి గర్వకారణంగా ఉంటుందని ఆకాంక్షించారు. "ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. సరైన సందర్భం, సమయాన్ని వెచ్చించి, పహల్గామ్ ఉగ్రవాద దాడి బాధితుల కుటుంబాలకు మేము అండగా నిలుస్తాము."మేము మా సంఘీభావాన్ని తెలియజేస్తున్నాం. చాలా ధైర్యసాహసాలు ప్రదర్శించిన మా సాయుధ దళాలన్నింటికీ ఈ విజయాన్ని అంకితం చేయాలనుకుంటున్నాము. "వారు మనందరికీ స్ఫూర్తినిస్తూనే ఉంటారని ఆశిస్తున్నాను. వారి ఆనందం కోసం మాకు అవకాశం దొరికినప్పుడల్లా మైదానంలో అలరిస్తూనే ఉంటాం" అని భారత కెప్టెన్ సూర్యకుమార్ కామెంట్స్ చేశాడు.సూర్యకుమార్ విజయాన్ని ప్రతిబింబిస్తూ, ఈ గెలుపు దేశానికి " సంపూర్ణమైన రిటర్న్ గిఫ్ట్"గా అభివర్ణించాడు.పాకిస్తాన్‌పై ఆధిపత్యం చెలాయించిన భారత కెప్టెన్ జట్టును అద్భుతంగా నడిపించాడు. సూర్యకుమార్ 37 బంతుల్లో అజేయంగా 47 పరుగులు చేసి, ఏడు వికెట్లు చేతిలో ఉండగా కేవలం 15.5 ఓవర్లలో 128 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి భారత్‌లో స్ఫూర్తిని నింపాడు. ప్రత్యర్థి ఎవరనేది సంబంధం లేకుండా, జట్టు కోసం ప్రతి మ్యాచ్‌ను గెలిచేలా సిద్ధంగా ఉండటం, ఫోకస్డ్‌గా స్థిరంగా ఉండటమే తమ ప్రాముఖ్యత అని భారత కెప్టెన్ నొక్కి చెప్పాడు.స్పిన్నర్ల పాత్రను హైలైట్ చేస్తూ, మిడిల్ ఓవర్లలో వారి చేసే పని ఆటకు టోన్‌ను మార్చేస్తుందని అన్నాడు. కుల్దీప్ యాదవ్ గేమ్ ప్లాన్‌కు కట్టుబడి ఉండటం వల్లే అద్భుతం చేయగలిగాడని ప్రశంసించాడు. భారత స్పిన్ త్రయం - కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి అద్భుతమైన స్పెల్‌తో పాకిస్తాన్ బ్యాటింగ్ లైనప్‌ను ఛేదించారు. వారిని 20 ఓవర్లలో 127/9కి పరిమిత చేశారు. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అభిషేక్ శర్మ భారత్‌కు మంచి ఆరంభాన్ని అందించాడు.బౌండరీలు, సిక్సరలుతో విరుచుకుపడ్డాడు. ఓ దశలో టాప్-ఆర్డర్ వికెట్లు పడిపోయిన తర్వాత కూడా, సూర్యకుమార్ యాదవ్ తిలక్ వర్మ మంచి భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారత్‌ను సులభంగా విజయం దిశగా నడిపించారు. ఈ విజయం మైదానంలో విజయం కంటే ఎక్కువ. ఆపరేషన్ సిందూర్ తర్వాత రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో వచ్చిన ఈ విజయం మెన్ ఇన్ బ్లూకు మరింత స్పెషల్ గా చెప్పవచ్చు. భారత్‌పై భారీ స్కోరు నమోదు చేయాలనే టార్గెట్‌తో పాకిస్తాన్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ వారి టాప్ ఆర్డర్ తడబడింది, మొదటి రెండు ఓవర్లలోనే రెండు వికెట్లు పడిపోయాయి. భారత్ బౌలింగ్ యూనిట్ మరోసారి ఆధిపత్యం చెలాయించింది. వికెట్లు తీస్తూ, డాట్ బాల్స్ వేస్తూ పాకిస్తాన్‌ను ఎక్కువ టైం సైలెంట్‌గానే ఉంచింది. స్పిన్నర్లు అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ అద్భుతంగా బౌలింగ్ చేశారు. ఎక్కువ పరుగులు ఇవ్వకుండా క్రమం తప్పకుండా వికెట్లు తీసుకున్నారు.

సైమ్ అయూబ్ చేతిలో మూడు వికెట్లు కోల్పోయినప్పటికీ భారత్ తన లక్ష్యాన్ని ఈజీగానే ఛేదించింది. తొలి బంతి నుంచే పాకిస్తాన్ బౌలర్లపై భారత్ బ్యాటర్లు ఆధిపత్యం ప్రదర్శించారు. మొత్తానికి మ్యాచ్‌లో అన్ని విభాగాల్లో పాకిస్తాన్‌పై భారత్ పై చేయిసాధించింది.

# శరవేగంగా పెద్ది సినిమా షూటింగ్



## ● దసరాకు మ్యూజికల్ సింగ్ విడుదలకు సన్నాహాలు

బలగం టీవీ, హైదరాబాద్

గేమ్ ఛేంజర్' సినిమాతో ఈ ఏడాది పెద్దగా ఆకట్టుకోలేని రామ్‌చరణ్ ఇప్పుడు తన నెక్ట్స్ సినిమాతో మళ్ళీ మాస్‌ను ఉర్రూతలూగించేందుకు రెడీ అవుతున్నారు. ప్రస్తుతం చరణ్ 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమాలో నటిస్తున్నారు. ఇది ఒక విలేజ్ స్పోర్ట్స్ రివెంజ్ డ్రామాగా రూపొందుతోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో నిర్మిస్తున్నారు.ఈ చిత్రం షఉటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది.రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్స్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇక కర్ణాటకలోని మైసూరు ప్రాంతంలో వెయ్యి మందికి పైగా డ్యాన్సర్లతో షఉట్ చేశారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో తెరకెక్కిన ఈ పాట సినిమాకే హైలైట్ కానుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా వచ్చే మార్చి 27న వరల్డ్ వైడ్‌గా విడుదల చేయాలని టీమ్ ప్లాన్ చేసింది. కాగా, దసరా పండుగ సందర్భంగా 'పెద్ది' నుంచి ఓ మ్యూజికల్ సింగిల్ విడుదల చేయనున్నట్లు- సమాచారం. ఇప్పటికే రామ్‌చరణ్ ఆ పాటను విన్నట్టు-, అది అద్భుతంగా ఉందని మెచ్చుకున్నట్టు సమాచారం. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ- జాన్వీ కపూర్ నటిస్తుండగా, సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్ పనిచేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కు ప్రేక్షకుల నుంచి విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా రామ్‌చరణ్ క్రికెట్ షాట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. కొంతమంది అంతర్జాతీయ క్రికెటర్లు కూడా దానిని రీ-క్రియేట్ చేయడంతో, సినిమా పట్ల ఆసక్తి మరింత పెరిగింది. రామ్‌చరణ్ అభిమానులు 'గేమ్ ఛేంజర్' ఫ్లాప్ తరువాత ఈ సినిమాపైనే ఆశలు పెట్టుకున్నారు. సుకుమార్ శిష్యుడు డైరెక్ట్ చేస్తుండటం, కథలో విలేజ్ బ్యాక్‌డ్రాప్, క్రికెట్, రివెంజ్ అంశాలు ఉండటంతో పాటు-, ఏఆర్ రెహమాన్ సంగీతం మేజర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి.దసరా సీజన్‌లో మెగాస్టార్ చిరంజీవి తన కొత్త సినిమా షఉటింగ్ ప్రారంభించనున్నట్టు- సమాచారం. బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రం 'వాల్తేరు వీరయ్య' తరువాత వారి రెండో కాంబో కావడం విశేషం. దీంతో దసరాకి తండ్రి, కొడుకులిద్దరూ మెగా ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇవ్వనున్నట్టు- గాసిప్ ఫిలింనగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

# నవంబర్ 7న జటాధర విడుదల

బలగం టీవీ, హైదరాబాద్




సక్సెస్, ఫెయిల్యూర్స్‌తో సంబంధం లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళ్తున్న యాక్టర్లలో ఒకడు సుధీర్ బాబు. ఈ టాలెంటె-డ్ యాక్టర్ ఈ సారి రూటు మార్చి సరికొత్త ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. సుధీర్ బాబు నటిస్తోన్న సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ జటాధర వెంకట్ కల్యాణ్ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్ తెలుగు, హిందీ బైలింగ్యువల్ సినిమాగా వస్తోంది. కాగా మేకర్స్ ఎన్నో రోజులుగా విడుదలపై నెలకొన్న డైలామాకు తెరదించారు. ఈ మూవీని నవంబర్ 7న తెలుగు, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ కూడా త్వరలో మొదలు కానున్నట్టు- ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. ఓ వైపు శివుడు మరోవైపు చేతిలో త్రిశూలాన్ని పట్టు-కున్న సుధీర్‌బాబు, ఇంకోవైపు ఉగ్రరూపంలో కనిపిస్తున్న సోనాక్షి సిన్హా లుక్స్‌ను మేకర్స్ ఇప్పటికే విడుదల చేయగా.. సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి. ఈ మూవీలో బాలీవుడ్ భామ సోనాక్షి సిన్హా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషిస్తోంది. సుధీర్ బాబు నటించిన హరోం హర, మా నాన్న సూపర్ హీరో సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయని తెలిసిందే. దీంతో తన ఆశలన్నీ జటాధర సినిమాపైనే పెట్టు-కున్నాడు. మరి ఈ సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ సుధీర్‌బాబుకు ఎంతలా కలిసొస్తుందో చూడాలి.

# మళ్లీ ఆడనున్న భారత్ పాక్..!

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా కప్ 2025 టోర్నీలో టీమిండియా దుమ్మురేపుతోంది. ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లోనూ సమష్టిగా చెలరేగిన భారత్.. దాయాదీ పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించి 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. పాక్‌తో మ్యాచ్ వద్దనే నిరసనల మధ్యే ఆ జట్టుతో ఆడిన భారత్.. అసాధారణ ప్రదర్శనతో చిరస్మరణీయ విజయాన్నందించింది. అనంతరం దేశ ప్రజల సెంటిమెంట్‌ను గౌరవిస్తూ పాకిస్థాన్ జట్టు పట్ల తమ నిరసనను తెలియజేసింది. పాక్ ఆటగాళ్లకు కనీసం షేక్ హ్యాండ్ కూడా ఇవ్వలేదు. అంతేకాకుండా ఈ విజయాన్ని భారత సాయుధ బలగాలకు అంకితమిచ్చింది.

లీగ్ మ్యాచ్‌లో పాక్‌ను ఓడించిన భారత్.. మరోసారి ఆ జట్టుతో తలపడే అవకాశం ఉంది. పాకిస్థాన్ తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో యూఏఈని ఓడిస్తే సూపర్ -4 బెర్త్‌ను దక్కించుకుంటుంది. అప్పుడు భారత్, పాకిస్థాన్ మధ్య సెప్టెంబర్ 21(ఆదివారం)న మరో మ్యాచ్ జరుగుతుంది. ఆ తర్వాత ఇరు జట్లు ఫైనల్‌కు చేరితే మూడో సారి కూడా తలపడే ఛాన్స్ ఉంది. కానీ ఆసియా కప్ చరిత్రలోనే భారత్, పాక్ ఇప్పటి వరకు ఫైనల్లో తలపడలేదు.

# సిరాజ్ కు ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు

బలగం టీవీ, హైదరాబాద్




భారత ఫాస్ట్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ ఐసీసీ మెన్స్ ప్లేయర్ ఆఫ్ ది మంత్ గా ఎంపికయ్యారు. ఈ రేసులో న్యూజిలాండ్, వెస్టిండీస్ ఆటగాళ్ల నుండి ఆయనకు గట్టి పోటీ ఎదురైంది. కానీ, చివరికి సిరాజ్ విజయం సాధించారు. ఆగస్టు 2025 నెలకిగాను ఆయనకు ఈ అవార్డు లభించింది. సిరాజ్‌తో పాటు ఈ రేసులో మ్యాట్ హెన్రీ, జైడెన్ సీల్స్ కూడా నామినేట్ అయ్యారు. కానీ, భారత పేసర్ వారిద్దరిపై పైచేయి సాధించారు. ఇంగ్లాండ్ పర్యటనలో టెస్ట్ సిరీస్‌ను డ్రా చేయడంలో మొహమ్మద్ సిరాజ్ పాత్ర చాలా కీలకంగా ఉంది. 5 టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ 2-2తో సమంగా ముగిసింది. అందులో మొహమ్మద్ సిరాజ్ బంతితో అత్యంత విజయవంతమైన ఆటగాడిగా నిలిచారు. అతను 5 టెస్టుల 9 ఇన్నింగ్స్‌లలో అత్యధికంగా 23 వికెట్లు తీశారు. ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో సిరాజ్ 2 సార్లు 5 వికెట్లు, 1 సారి 4 వికెట్లు తీసి అద్భుతం చేశారు. ఆయన 32.43 సగటుతో 23 వికెట్లు పడగొట్టారు.ఇంగ్లాండ్‌తో జరిగిన 5 టెస్టుల సిరీస్‌లో సిరాజ్ అత్యధిక వికెట్లు తీసిన ఆటగాడు మాత్రమే కాదు. ఆయన అత్యధికంగా 1113 బంతులు కూడా వేశారు. సిరాజ్‌కు ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును గెలిపించడంలో ఆయన ఓవల్ టెస్ట్‌లో వేసిన స్పెల్ నిర్ణయాత్మక పాత్ర పోషించింది. ఆగస్టు నెలలో ఆయన ఆడిన ఏకైక టెస్ట్ అదే, దానివల్లే ఆయనకు ఈ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు లభించింది. కుడిచేతి వాటం ఫాస్ట్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ ఓవల్ టెస్ట్ రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 21.11 సగటుతో మొత్తం 9 వికెట్లు తీసుకున్నారు. ఆయన అద్భుతమైన ప్రదర్శన టీమిండియా ఆ టెస్ట్‌ను గెలవడానికి, సిరీస్‌ను డ్రా చేయడానికి కూడా సహాయపడింది. ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో అన్ని టెస్టులు ఆడిన ఏకైక భారత పేసర్ మొహమ్మద్ సిరాజ్ మాత్రమే. ఆగస్టు 2025 కోసం ఐసీసీ మెన్స్ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అయిన తర్వాత సిరాజ్ మాట్లాడుతూ.. ఈ అవార్డు తనకు చాలా ప్రత్యేకం అని అన్నారు. ఆండర్సన్-టెండూల్కర్ సిరీస్ చాలా జ్ఞాపకాలను మిగిల్చిందని, రెండు జట్ల మధ్య గట్టి పోటీ జరిగిందని చెప్పారు. సిరాజ్ ఇంకా మాట్లాడుతూ.. ఈ అవార్డు తనకెంత ముఖ్యమో తన సపోర్ట్ స్టాఫ్, మిగతా ఆటగాళ్లకు కూడా అంతే ముఖ్యం అని చెప్పారు. ఇది తనపై వారు ఉంచిన నమ్మకానికి దక్కిన విజయం అని తెలిపారు. భారత జెర్సీలో తన లక్ష్యం ఎప్పుడూ తన అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడమే అని అన్నారు.

# సంస్కారం లేని వార్తలు ప్రచారం

## ● జగపతి బాబు టాక్‌షోలో నటి మీనా ఆవేదన

బలగం టీవీ, హైదరాబాద్



చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలోకి వచ్చిన మీనా అగ్ర కథానాయకుల సరసన నటించి స్టార్‌గా ఎదిగారు. తాజాగా జగపతిబాబుతో ఆమె 'జయమ్ము నిశ్చయమ్మురా' కార్యక్రమానికి అతిథిగా హాజరై తన కెరీర్, పర్సనల్ లైఫ్ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. స్టార్ హీరోలతో నటించిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కృష్ణ, రజనీకాంత్ ఇద్దరికీ తాను కూతురుగా, హీరోయిన్‌గా నటించినట్లు- చెప్పారు. నటుడు జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ టాక్ షో 'జీ 5' లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇక తాను భర్తను కోల్పోయినప్పుడు సోషల్ మీడియాలో తనపై వచ్చిన న్యూస్‌పై మీనా అసహనం వ్యక్తంచేశారు. నా భర్త చనిపోయిన వారం తర్వాత నేను రెండో పెళ్లి చేసుకుంటున్నట్లు- రాశారు. వాళ్లకు కుటుంబాలు ఉండవా.. ఇలా రాస్తున్నారు. అని చాలా బాధపడ్డాను. ఆ తర్వాత ఎవరు విడాకులు తీసుకొన్నా నాతో పెళ్లి అని రాసేవారు. అలాంటి వార్తల వల్ల నాకు అసహ్యం వేసేదని తెలిపారు. 1986లో చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలోకి వచ్చిన మీనా తమిళంతో పాటు- తెలుగులోనూ అగ్ర హీరోల సరసన నటించారు. రజనీకాంత్, చిరంజీవి, వెంకటేశ్, నాగార్జున, బాలకృష్ణ అందరితోనూ హిట్ సినిమాల్లో అలరించారు. కెరీర్‌లో మంచి అవకాశాలు వస్తున్నప్పుడే 2009లో విద్యాసాగర్‌ను వివాహం చేసుకున్నారు. ఆయన 2022లో అనారోగ్యం కారణంగా తుదిశ్వాస విడిచారు. ప్రస్తుతం మీనా 'మూకుతి అమ్మన్ 2'లో నటిస్తున్నారు. చాలామంది నిర్మాతలు ఫ్లాప్‌లలో ఉన్నామని తక్కువ అమౌంట్‌తో సినిమా చేస్తున్నామని నన్ను సంప్రదించేవారు. నేను సరేనని అంగీకరించేదాన్ని. ఆ చిత్రాలు సూపర్‌హిట్ అయ్యేవి. తర్వాత నన్ను మర్చిపోయేవారు. ఎప్పుడూ ఇలానే జరిగేది. కెరీర్‌లో వరుస అవకాశాలు వస్తున్నప్పుడే పెళ్లి చేసుకున్నాను. ఆ తర్వాత పాప పుట్టిన రెండేళ్లకు మలయాళం సినిమా దృశ్యం కోసం నన్ను సంప్రదించారు. పాపను వదిలి వెళ్లలేక తిరస్కరించాను. వాళ్లు రిక్వెస్ట్ చేశారు. కథ రాసేటప్పుడు నన్ను దృష్టిలోపెట్టుకున్నట్లు- తెలిపారు. వేరే వారితో సినిమా చేయలేమన్నారు. దీంతో అంగీకరించాను. జగపతిబాబు నాకు ఎప్పుడూ పోటీనే.. మీ పక్కన నేను వస్తుంటే నన్ను ఎవరూ చూసేవారు కాదు. అందరూ మిమ్మల్నే చూసేవారు' అంటూ మీనా సరదా సంగతులు పంచుకున్నారు. దివంగత నటి సౌందర్యతో తన అనుబంధాన్ని పంచుకొని మీనా ఎమోషనల్ అయ్యారు. ఆరోజు ఎన్నికల ప్రచారానికి సౌందర్యతో పాటు- తాను వెళ్లాల్సిఉందని కాకపోతే